- ఈ గురుకుల హాస్టల్లో ఉండలేం

పెద్దపల్లి జిల్లా మంథని మండలం వెంకటాపూర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకులం, హాస్టల్‌లో కనీస సౌకర్యాలు లేక, స్కూల్లో ఉపాధ్యాయులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆందోళన వ్యక్తంచేశారు. సోమవారం ఉదయం 6 గంటలకే హాస్టల్ నుంచి దాదాపు 100 మంది బాలురు బయటికొచ్చి మూడున్నర కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లి వెంకటాపూర్ క్రాస్ వద్ద మంథని-కాటారం ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. –మంథని రూరల్

- సాగునీరు ఇవ్వాలని రైతుల ధర్నా

కరీంనగర్ జిల్లా చొప్పదండిలోని ఎస్సారెస్పీ డీ-86, డీ-87 కాలువలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చొప్పదండి, కొలిమికుంట, చాకుంట, వెదురుగట్టతోపాటు వివిధ గ్రామాల రైతులు సోమవారం రోడ్డెక్కారు. చొప్పదండి పట్టణంలోని జాన్సీ హై స్కూల్ వద్ద కరీంనగర్-రాయపట్నం రహదారిపై ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నీళ్లులేక వరి, మక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. – చొప్పదండి

- ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం చౌటపల్లి వాసులు దాహార్తితో అలమటిస్తున్నారు. లింగంపల్లి వద్ద నీటి సరఫరా పైపు పగిలిపోవడంతో భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. ఆగ్రహించిన చౌటపల్లి వాసులు సోమవారం రెండు గంటలపాటు రోడ్డుపై బైఠాయించారు. భగీరథ నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామన్న పంచాయతీ కార్యదర్శి హామీతో ఆందోళన విరమించారు. – నవాబ్‌పేట

లోకం పోకడ

ఆ ఆత్మహత్యకు అప్పులే కారణం

- అనారోగ్య సమస్యలూ తోడయ్యాయి
- సీఎం సొంత జిల్లాలో రైతు శ్రీశైలం ఆత్మహత్యపై తహసీల్దార్ నివేదిక
- కలెక్టర్ ఆదేశాలతో గ్రామంలో విచారణ
- మృతుడికి 1.15 ఎకరాల పొలం
- 'నమస్తే' కథనం నిజమని రూఢీ
- కాంగ్రెస్ నేతల తప్పుడు ప్రచారానికి తెర
- స్పందించని జిల్లా మంత్రి, ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/భూత్పూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో రైతు శ్రీశైలం ఆత్మహత్యకు దారితీసిన కారణాలపై 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన కథనం అక్షర సత్యమని అధికారుల నివేదిక కూడా రూఢీ చేసింది. దీంతో కాంగ్రెస్ నేతలు నడిపిన హైడ్రామాకు తెరపడింది. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామానికి చెందిన రైతు శ్రీశైలం అప్పుల బాధతోపాటు అనారోగ్య సమస్యలతోనే ఆత్మహత్య చేసుకున్నాడని భూత్పూర్ తహసీల్దార్ రాజు జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. దీంతో శ్రీశైలం రైతు కాదని, గొర్రెల కాపరి అని, ఆయనకు పొలమే లేదంటూ స్థానిక కాంగ్రెస్ నేతలు సాగించిన ప్రచారం అబద్ధమని తేలిపోయింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఆత్మహత్యపై విచారణ జరిపిన రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు రికార్డులను పరిశీలించి శ్రీశైలం పేరిట 1.15 ఎకరాల భూమి ఉన్నట్టు నిర్ధారించారు. ఆ పొలం నీళ్లు లేక ఎండిపోయిందని, పొలంలో వేసిన బోర్లలో కూడా నీళ్లు రాలేదని, దీంతో అప్పులు పెరిగిపోయాయని నివేదికలో పేర్కొన్నారు.

మద్దిగట్లలో ఇంటి ముందు పిల్లలతో దిగాలుగా కూర్చున్న రైతు శ్రీశైలం భార్య శ్రీశైల

అనాథలైన చిన్నపిల్లలు

మృతుడు శ్రీశైలం కుమారుడు గణేశ్, కూతురు మీనాక్షి ఇద్దరూ చిన్నపిల్లలే. ఆయన భార్య శ్రీశైల ఆ షాక్ నుంచి తేరుకోలేకపోతున్నది. తన భర్త, తమను అనాథలుగా చేసి వెళ్లిపోతాడని అనుకోలేదని ఆవేదన వ్యక్తంచేసింది. ఆ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అప్పులన్నీ ప్రభుత్వమే చెల్లించాలని, మృతుడి భార్యకు ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నారు. రైతు కుటుంబానికి పక్కా ఇల్లును మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కండ్ల ముందే పొలం ఎండిపోతుండటం, వేసిన బోర్లల్లో నీళ్లు రాకపోవడంతో మనస్తాపం చెందిన శ్రీశైలం (30) శనివారం సాయంత్రం తన ఇంట్లోనే ఉరేసుకొని చనిపోయాడు. ఈ విషయాన్ని 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చింది. సీఎం సొంత జిల్లా కావడంతో ప్రభుత్వానికి ఎక్కడ చెడ్డ పేరు వస్తుందోనన్న భయంతో కొంతమంది కాంగ్రెస్ నేతలు ఈ ఆత్మహత్యపై భిన్నాభిప్రాయాలు ప్రచారం చేశారు. 'నమస్తే తెలంగాణ'పై అక్కసు వెళ్లగక్కారు. ఈ నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ' ప్రతినిధి బృందం గ్రామానికి వెళ్లి నిజనిజాలను నిర్ధారించింది. ఒకవైపు భర్త దేహానికి పోస్టుమార్టం జరుగుతుండగా ఆయన భార్య శ్రీశైల.. తన భర్త ఆత్మహత్యకు అప్పులే కారణమని విలపించింది. మరోవైపు, గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేతలు ఇది ఆత్మహత్య కాదని చెప్పించేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో భూత్పూర్ తహసీల్దార్, వ్యవసాయశాఖ అధికారి ఆదివారం సాయంత్రం గ్రామాన్ని సందర్శించి రైతు ఆత్మహత్యకు ప్రధానంగా అప్పులే కారణమని నివేదిక సమర్పించారు.

గొర్రెల కాపరి అంటూ ప్రచారం

మద్దిగట్లలో చనిపోయింది అసలు రైతే కాదని, గొర్రెల కాపరి అంటూ ఇతర మీడియాకు కాంగ్రెస్ నేతలు తప్పుడు సమాచారం అందించారు. కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని, పోలీసులకు కూడా ఇదే ఫిర్యాదు అందడంతో మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారని ప్రచారం చేశారు. రైతు ఆత్మహత్య చేసుకుంటే సీఎం రేవంత్ రెడ్డికి చెడ్డపేరు వస్తుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ కుటుంబాన్ని మేనేజ్ చేయాలంటూ ఒక కాంగ్రెస్ ప్రముఖుడు ఇచ్చిన డైరెక్షన్ ప్రకారమే స్థానిక నేతలు ఇలాంటి ప్రచారానికి ఒడిగట్టినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో విచారణకు వెళ్లిన అధికారులను సైతం తప్పుదోవ పట్టించారు. రైతుకు చెందిన పొలాన్ని కాకుండా ఇతరుల పొలాన్ని చూపించి ఇదే పొలం అంటూ నమ్మబలికారు.

స్పందించని మంత్రి, ఎమ్మెల్యేలు

శ్రీశైలం ఆత్మహత్యపై ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కనీసం స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలొస్తున్నాయి. మరోవైపు, రైతు ఆత్మహత్య చేసుకోలేదని స్థానిక కాంగ్రెస్ నేతలతో చెప్పించేందుకు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. కాగా, అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఎంపీపీ కదిరే శేఖర్‌రెడ్డి రైతు కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. రూ.5 వేల నగదును మృతుడి భార్యకు అందజేశారు. మృతుడి కుమారుడు గణేశ్‌ను పదో తరగతి వరకు చదివిస్తానని హామీ ఇచ్చారు.

కరెంట్ కాటుకు మరో రైతు బలి

ఖానాపురం, ఏప్రిల్ 8: విద్యుత్తు షాక్‌తో మరో రైతు మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా ఖానాపురం మండలం కొడ్తిమాట్‌తండాలో సోమవారం చోటుచేసుకున్నది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోత్ చందర్ (50) తన పొలంలో మక్కజొన్న పంటను సాగు చేస్తున్నాడు. కొద్దిరోజులుగా తన బావిలో నీళ్లులేకపోవడంతో పంట ఎండిపోతున్నది. పక్కనే ఉన్న తన బాబాయి సోమ్లా బావి నుంచి నీటిని తన పొలానికి పారించేందుకు వెళ్లాడు. మోటరు వేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్‌కు గురై చందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమీప పొలాల్లోని రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడి వివాహం కాగా, చిన్న కుమారుడికి ఈ నెల 24న వివాహం జరగాల్సి ఉన్నది. ఇంతలోనే విద్యుత్తు షాక్‌తో మరణించడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రఘునాథ్ తెలిపారు.

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	43.5°c	22.0°c
రంగారెడ్డి	41.6°c	22.9°c
మహబూబ్‌నగర్	41.5°c	29.3°c
నిజామాబాద్	40.5°c	26.0°c
నల్లగొండ	40.4°c	24.4°c
వరంగల్	39.0°c	26.0°c
మెదక్	38.9°c	23.0°c
కరీంనగర్	38.0°c	24.0°c
ఖమ్మం	37.0°c	25.0°c
హైదరాబాద్	36.7°c	27.8°c

సాగర్ కుడి కాల్వకు కొనసాగుతున్న నీటి విడుదల

సాగర్ కుడి కాల్వకు నీటి విడుదల

ఇప్పటివరకు ఇచ్చింది 18 టీఎంసీలు.. ఇప్పుడు మళ్లీ 5 టీఎంసీలు

ఎడమ కాల్వకు విడుదల చేసింది 13 టీఎంసీలే

నందికొండ, ఏప్రిల్ 8 : ఆంధ్రప్రదేశ్ తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ కుడి కాల్వ ద్వారా ఏపీ ఎన్నెస్పీ అధికారులు సోమవారం నీటిని విడుదల చేశారు. కృష్ణా యాజమాన్య బోర్డు ఈఈ శివశంకరయ్య పర్యవేక్షణలో కుడి కాల్వ 5, 7 తూము గేట్ల నుంచి 5,500 క్యూసెక్కుల నీటిని ఎన్నెస్పీ ఈఈ శ్రీహరి విడుదల చేశారు. తాగునీటి అవసరాల కోసం 10 రోజుల పాటు 5 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్టు తెలిపారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లోకి ఈ ఏడాది వరద నీరు రాకపోయినా.. తాగునీటి అవసరాల కోసం కుడి కాల్వ ద్వారా ఏపీవాళ్లు ఇప్పటి వరకు 18 టీఎంసీల నీటిని వాడుకున్నారు. ఇప్పుడు మరో 5 టీఎంసీల నీటిని వాడుకునేందుకు విడుదల చేశారు. దీంతో మొత్తంగా కుడి కాల్వ ద్వారా 23 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లవుతుంది. అయితే.. తెలంగాణకు ఎడమ కాల్వ ద్వారా కృష్ణా జిల్లాకు విడుదల చేసిన 2 టీఎంసీల నీటిని కలుపుకొని ఈ ఏడాదిలో ఇప్పటివరకు 13 టీఎంసీల నీటిని విడుదల చేశారు. నాగార్జునసాగర్ డ్యామ్ ప్రస్తుత నీటి మట్టం 511.20 అడుగుల వద్ద 133.7164 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. రిజర్వాయర్‌లో నీటి మట్టం 510 అడుగులకు దిగువకు చేరితే డేడ్ స్టోరేజీకి చేరినట్టు. ప్రాజెక్టులో నీటి మట్టం బాగా తగ్గిపోతుండటం, ఇంకా వానకాలం సీజన్ రావడానికి 4 నెలల గడువు ఉండటంతో రానున్న రోజుల్లో తెలంగాణ ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కోనున్నట్టు నిపుణులు చెప్తున్నారు.

తక్షణమే సాగునీరివ్వాలి

మేడిగడ్డ నీటిని ఒడిసిపట్టి లిఫ్ట్ చేయాలి

బరాజ్ పరిశీలనలో సీపీఎం నాయకులు

మహదేవపూర్, ఏప్రిల్ 8: తక్షణమే వ్యవసాయానికి సాగునీరందించి రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, కేంద్ర కమిటీ సభ్యులు జీ నాగయ్య, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం వారు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి బందు సాయిలుతో కలిసి మేడిగడ్డ బరాజ్‌ను సందర్శించారు. బరాజ్‌లో కుంగిన పిల్లర్లను, బరాజ్‌కు ఎగువన మహారాష్ట్రలోని ప్రాణహిత నది ద్వారా వస్తున్న ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లోను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాగునీటి కష్టాలతో రైతులు అల్లాడుతున్నారని, మేడిగడ్డకు ఎగువ నుంచి వస్తున్న నీరు వృథాగా దిగువకు పోతున్నదని, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎగువకు లిఫ్ట్ చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కష్ట కాలంలో మేడిగడ్డ నీటిని వినియోగించడంతోనే ప్రజలకు తాగు, రైతులకు సాగునీటి కష్టాలు తీరుతాయని చెప్పారు. మేడిగడ్డపై రాజకీయాలు మానుకొని రైతుల కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం ఆలోచన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టీ సాగర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోలం రాజేందర్, జిల్లా కమిటీ సభ్యులు వీ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

23,000 చెరువులు ఖాళీ

మొదటిపేజీ తరువాయి...

వదలకపోవడంతో చెరువులు ఎండిపోయి నెర్రలు పారాయి. ప్రాజెక్టుల్లో నీటి కొరత కారణంగానే కాలువల్లో నీటి విడుదల చేయలేదని సర్కారు సాకు చూపిస్తున్నది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేనాటికి ఎస్సారెస్పీలో 78.66 టీఎంసీలు, మిడ్ మానేరులో 23 టీఎంసీలు, ఎల్ఎండీలో 19.42 టీఎంసీలు, ఎల్లంపల్లిలో 16.03 టీఎంసీలు, సింగూరులో 25.81 టీఎంసీలు, నిజాంసాగర్‌లో 16.16 టీఎంసీలు, కడెంలో 4.3 టీఎంసీలు, శ్రీశైలంలో 57టీఎంసీలు, నాగార్జునసాగర్‌లో 157 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నాయి. అందులో కొద్దిమేర నీటితోనైనా ఆయా ప్రాజెక్టుల పరిధిలోని చెరువులను కనీసం 50శాతం నింపినా ఈ రోజు కరువు కోరల్లో చిక్కుకోవాల్సిన పరిస్థితి తలెత్తి ఉండేదని కాదని అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం తమతో చర్చించింది కూడా లేదని అధికారులు చెబుతుండడం గమనార్హం. అదే దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించి ఈ ఏడాది దాదాపు 9 టీఎంసీలను లిఫ్ట్ చేయడంతోపాటు, ఆ ప్రాజెక్టు పరిధిలోని చెరువులను ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం కొద్దిమేర నింపింది. ఇటీవల రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తే మల్లన్నసాగర్, రంగానాయకసాగర్ పరిధిలోని చెరువులకు, చెక్‌డ్యామ్‌లకు నీళ్లను వదిలింది.

అడుగంటిన జలాలు

రాష్ట్రవ్యాప్తంగా 34,712 చెరువుల్లో ఏకంగా 23,211 చెరువుల్లో జలాలన్నీ అడుగంటిపోయాయి. 7592 చెరువుల్లో 50శాతం కంటే తక్కువ నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయి. మిగిలిన చెరువుల్లోనే కొద్దిమేర జలాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఇదిలా ఉంటే భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, నల్గొండ, కామారెడ్డి, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నాగర్‌కర్నూల్ ఇరిగేషన్ సర్కిళ్ల పరిధిలోని 90శాతం చెరువులు దాదాపు అడుగంటిపోయాయి. మిగతా ఇరిగేషన్ సర్కిళ్ల పరిధిలోని చెరువుల్లోనూ కొద్దిమేర మాత్రమే నీటి నిల్వలు ఉన్నాయి.

బోర్లన్నీ ఫెయిల్..

గొలుసుకట్టు చెరువులను వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న క్రమంలోనే తెలంగాణ ప్రాంతంలో వ్యవసాయ బోరుబావుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. రాష్ట్ర ఏర్పాటు నాటికి దాదాపు 20లక్షల బోరుబావులుండగా వాటి కింద సాగయింది మాత్రం 23లక్షల ఎకరాలు మాత్రమే. అది కూడా ఎప్పుడూ స్థిరంగా ఉన్నది లేదు. వానలు పడినా ఎండిపోవాల్సిన దుస్థితి. తెలంగాణ ఏర్పాటు తరువాత కేసీఆర్ అమలు చేస్తున్న బహుముఖ జలసంరక్షణ చర్యల ఫలితంగా బోరుబావుల కింద వ్యవసాయం కూడా పండుగలా మారింది. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా 1.10 కోట్ల ఎకరాలు సాగువగా అందులో దాదాపు 45లక్షల ఎకరాలు 30లక్షల బోర్లు కిందనే సాగయిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కానీ ఈ ఏడాది చెరువులను నింపకపోవడం వల్లే బోర్లన్నీ ఫెయిలవుతున్నాయని రైతులు వివరిస్తున్నారు. వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోవడానికి కూడా అదే ప్రధాన కారణమని అర్థమవుతున్నది. మొత్తంగా ఇదీ ప్రభుత్వ అవగాహన రాహిత్యం ఫలితంగానే కరువు దాపురించిందనే స్పష్టంగా తెలిసిపోతున్నది.

కేటీఆర్ సొంత నిధులతో బడి భవనం రెడీ

ఇచ్చిన మాట నిలుపుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

కొదురుపాకలో అమ్మమ్మ-తాతయ్య జ్ఞాపకార్థం స్కూల్ బిల్డింగ్

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): ఇచ్చిన మాట ప్రకారం తన సొంత నిధులతో అమ్మమ్మ-తాతయ్య జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాల నిర్మాణం పూర్తయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తెలిపారు. సిరిసిల్ల జిల్లా చొప్పదండి నియోజకవర్గం కొదురుపాకలో తాతయ్య జే కేశవరావు, అమ్మమ్మ లక్ష్మి జ్ఞాపకార్థం ప్రభుత్వం స్కూల్‌కు కొత్త భవనాన్ని కేటీఆర్ సొంత నిధులను వెచ్చించి కట్టించారు. భవన నిర్మాణం దాదాపు పూర్తయింది. చిన్న చిన్న పనులు మినహా పనులన్నీ పూర్తయ్యాయని, వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు భవనం అందుబాటులోకి వస్తుందని ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు. నూతన స్కూల్ భవన ఫొటోలను షేర్ చేశారు.

72వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

- 5,923 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రవ్యాప్తంగా 72 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు పౌరసరఫరాల శాఖ తెలిపింది. ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం సేకరణకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో 7,149 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపింది. సోమవారం వరకు 5,923 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్టు వెల్లడించింది. ఇప్పటి వరకు ఐదు జిల్లాల్లో 556 కొనుగోలు కేంద్రాల ద్వారా 10,325 మంది రైతుల నుంచి దాదాపు 72,071 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్టు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ధాన్యం సేకరణ సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తినా 1967 లేదా 180042500333 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని పౌరసరఫరాశాఖ అధికారులు తెలిపారు.

నల్లగొండ డీసీసీబీ చైర్మన్, అపెక్స్ బ్యాంకు వైస్‌చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి జాతీయ స్థాయిలో ఉత్తమ సహకార బ్యాంకు అధ్యక్షుడి అవార్డు అందుకున్నారు. సహకార రంగంలో చేసిన అత్యుత్తమ కృషికి గాను న్యూఢిల్లీలోని ఇంటలెక్చువల్ పీపుల్స్ ఫౌండేషన్.. ఐదుగురు అత్యుత్తమ చైర్మన్లుగా ఎంపికచేసింది. ఆ ఐదుగురిలో గొంగిడి మహేందర్‌రెడ్డి ఒకరు.– నల్లగొండ ప్రతినిధి

తడారిన పొలంలోనే తనువు చాలించాడు

మొదటిపేజీ తరువాయి...

వారి వద్ద అప్పు చేసి ఒక బోరు వేయించాడు. చుక్క నీరు రాలేదు. అయినా సాగుపై ఆశ చావలేదు. నీళ్లు ఎలాగైనా పడుతాయనే ఆశతో మరో బోరు వేశాడు. మళ్లీ అదే పరిస్థితి. మూడో ప్రయత్నం కూడా విఫలమైంది. అయినా ధైర్యం చేసి నాలుగో బోరు వేశాడు. ఈ సారీ బోరులో నీళ్లు రాలేదు. కానీ రైతు కంట కన్నీరు ఆగలేదు. వందలాది ఫీట్లు బోరు తవ్వినా పొలం గట్లపై మట్టి దుబ్బలే మిగిలాయి. మరో వైపు అప్పులు కుప్పగా మారాయి. సాగు ఆశలన్నీ చెదిరిపోవడంతో ఆ దళిత రైతు పొలం పక్కనే చెట్టుకు ఉరేసుకున్నాడు. తడారి నోళ్లు తెరిచిన పొలాల మధ్యే తనువు చాలించాడు. కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన దళిత రైతు దుర్గయ్య కుటుంబ దుర్భర పరిస్థితి ఇది.

మట్టి దుబ్బనే సాక్ష్యం

దుర్గయ్య కుటుంబ దుస్థితికి పొలంలో బోర్లు వేసిన తర్వాత మిగిలిన మట్టి దుబ్బనే సాక్ష్యంగా నిలిచింది. నెర్రెలు బారిన నేల మధ్యలో ఫెయిలైన బోర్లను చూసి దుర్గయ్య భార్య శోభ ఎక్కెక్కి ఏడుస్తున్నది. బోర్లు వేసే సంసారం బోర్లబొక్కపడ్డదని బరువెక్కిన హృదయంతో తెలిపింది. కండ్లముందే బిడ్డ ఉండాలని కోరుకున్న బాపు.. కానరాకుండా పోయిండని ఒక్కగానొక్క కుమార్తె పూజ బోరుమన్నది. తండ్రిని పోగొట్టుకున్న బాధలో కూతురు గుండెలవిసేలా రోదిస్తున్నది. అప్పటివరకు ఉన్నకాడికి సర్దుకున్న ఆ కుటుంబం ఒక్కసారిగా డీలా పడింది. ఇంటి పెద్దను కోల్పోయిన బాధ ఒక వైపు, బోరు వేసేందుకు చేసిన అప్పు మరోవైపు ఆ కుటుంబాన్ని పట్టి పీడిస్తున్నది. నాలుగు బోర్లు వేయిస్తే.. నాలుగైదు లక్షలపైనే ఖర్చు వచ్చినట్టు భార్య శోభ తెలిపింది. నీళ్లు పడితే దర్జాగా బతుకొచ్చని అనుకున్నామని, దుర్గయ్య మరణంతో దుర్భర బతుకు అయ్యిందని శోభ రోదిస్తూ చెప్పింది. ఎవ్వసానికైన అప్పులు, దిగుబడి నష్టాలు కాలసర్పల్లా కాళ్లకు చుట్టుకుని ఆత్మహత్యలకు తెగబడాల్సిన దురావస్థ మరే రైతుకూ రాకూడదని వారంతా వేడుకుంటున్నారు. జనవరి 28, 2024న దుర్గయ్య చనిపోతే ఇంతవరకు రైతుబీమా చెక్కు అందలేదని మృతుడి భార్య శోభ ఆవేదన వ్యక్తం చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సలహాదారు షబ్బీర్ అలీ సొంత నియోజకవర్గంలో ఓ దళిత రైతు చనిపోతే ఎవరూ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిచ్చింది. అట్టడుగు వర్గాల సంక్షేమ కోసం ప్రభుత్వానికి సలహాదారుగా ఉండి కూడా సహకారం చేయలేకపోవడంపై బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తున్నది. రైతుబీమా కోసం మొదట్లో వివరాలు తీసుకున్న వారికి కాల్ చేస్తే మాటిమాటికి ఫోన్ చేయొద్దని దబాయిస్తున్నారని రోదిస్తూ ఆవేదన వ్యక్తం చేసింది.

ఆదుకోండి సారూ..

మాది చాలా పేద కుటుంబం. కూలీనాలీ చేసుకునేటోళ్లం. 2 ఎకరాల పొలంలో బోర్లు వేసుకుని సాగు చేసుకుందామనుకున్నం. నాలుగు బోర్లు ఫెయిల్ వేసినా అయినయ్. కాలం కలిసి రాలేదు. బోర్ల కోసం చేసిన అప్పులు మెడ మీదున్నయి. అప్పులు కట్టలేకనే నా భర్త జీవి ఇడిసిండు. ఇప్పుడు మేమెట్ల బతకాలి. అప్పులెట్ల తీర్చాలి. ప్రభుత్వం మమ్ముల్ని ఆదుకుంటేనే మాకు బతుకుదెరువు. దండెం పెట్టి అడుగుతున్న ఆదుకోండి సారూ. - శోభ, దుర్గయ్య భార్య

ధాన్యానికి నిప్పు పెట్టి రైతుల నిరసన

అడ్డగూడూరు, ఏప్రిల్ 8: ధాన్యం కొనుగోలు చేయడం లేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై వడ్లు పోసి నిప్పు పెట్టి నిరసన తెలిపారు. ఈ సంఘటన సోమవారం సూర్యాపేట జిల్లా అడ్డగూడూరులో చోటుచేసుకుంది. అడ్డగూడూరులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఈ నెల 1న ప్రారంభించారు. ఇంకా కాంటాలు వేయడం లేదు. దీంతో ఆగ్రహించిన రైతులు సోమవారం వడ్లకు నిప్పు పెట్టి నిరసన తెలిపారు. ఇప్పటికే పంటలు ఎండిపోగా.. పండిన కొద్ది ధాన్యాన్ని కూడా అధికారులు కొనడం లేదని విమర్శించారు. వడ్లను కొనాలని ఏపీఎం వెంకటేశ్వర్లును అడిగితే కలెక్టర్ నుంచి ఆదేశాలు రాలేదని, మిల్లు ట్యాగ్ కాలేదని చెప్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు సోమిరెడ్డి పురుషోత్తంరెడ్డి, బైరెడ్డి నర్సిరెడ్డి, దాసరి బాలరాజు, పరిగెల సత్యనారాయణ, అసర్ల బీరుమల్లు, కడారి సోమన్న, బోయపల్లి కంట్లం, గజ్జెల్లి రవి, చిన్నం రాములు, దాసరి వెంకటయ్య పాల్గొన్నారు.

అడ్డగూడూరులో ధాన్యానికి నిప్పు పెట్టి నిరసన తెలుపుతున్న రైతులు